క్లుప్తంగా

కలెక్టర్‌కు వినతి



వినతిపత్రం అందజేస్తున్న లక్ష్మణ్

ఖమ్మంరూరల్‌: వరదలకు పంట నష్టపోయిన రైతులకు నష్టపరిహారం అందించాలని కోరుతూ కలెక్టర్‌ ముజమ్మిల్‌ఖాన్‌కు ఏదులాపురం సొసైటీ అధ్యక్షుడు జే.లక్ష్మణ్‌ సోమవారం వినతిపత్రం అందించారు. వరద ప్రభావానికి కొట్టుకుపోయిన విద్యుత్‌ స్తంభాలను, ట్రాన్స్‌ఫార్మర్లను పునరుద్ధరించాలని కోరారు.

20 నుంచి జర్నలిస్టులకు హౌసింగ్‌ సొసైటీ సభ్యత్వం



మాట్లాడుతున్న సైదులు

ఖమ్మం సహకారనగర్‌: ఖమ్మం నియోజకవర్గ జర్నలిస్టులకు ఈ నెల 20 నుంచి హౌసింగ్‌ సొసైటీ సభ్యత్వాన్ని సీనియారిటీ ప్రకారం ఇవ్వనున్నట్లు స్తంభాద్రి జర్నలిస్టు మ్యూచువల్లీ ఎయిడెడ్‌ హౌస్‌ బిల్డింగ్‌ లిమిటెడ్‌ సొసైటీ అధ్యక్షుడు కనకం సైదులు తెలిపారు. సోమవారం జెడ్పీ గెస్ట్‌ హౌజ్‌లో సొసైటీ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సైదులు మాట్లాడుతూ... కొంతకాలంగా సొసైటీలో ఖాళీగా ఉన్న పదవులను ఈ సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. సొసైటీ కార్యదర్శిగా బొల్లం శ్రీనివాస్‌, ఉపాధ్యక్షుడిగా మైసా పాపారావు, కోశాధికారిగా వెన్నబోయిన సాంబశివరావులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.

సర్వేలో వివరాలు నమోదు చేసుకున్న రాయల

ఖమ్మంవన్‌టౌన్‌: సమగ్ర కుటుంబ సర్వేలో సోమవారం రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్‌ రాయల నాగేశ్వరరావు పేరు నమోదు చేయించుకున్నారు. ఈ సందర్భంగా రాయల మాట్లాడుతూ... ప్రతి ఒక్కరూ సర్వే అధికారులకు సహకరించాలన్నారు. డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్‌, ఓబీసీ సెల్‌ జిల్లా అధ్యక్షుడు పుచ్చకాయల వీరభద్రం, కేతినేని వేణు, పాలకుర్తి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఆర్థికసాయం



చెక్కు అందజేస్తున్న పుల్లయ్య

ఖమ్మం సహకారనగర్‌: ప్రొఫెసర్‌ జయశంకర్‌ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో సీటు సాధించిన గుర్రం వర్షితకు పరిశ సీతారత్నం ట్రస్ట్‌ రూ.20 వేల ఆర్థికసాయాన్ని జిల్లా వ్యవసాయశాఖాధికారి పుల్లయ్య చేతుల మీదుగా విద్యార్థినికి సోమవారం అందించారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్‌ చైర్మన్‌ పరిశ పుల్లయ్య, నాయకులు కనపర్తి వెంకటేశ్వర్లు, విజయలక్ష్మి పాల్గొన్నారు.

ఒకే కుటుంబంలో 'రెండు' కొలువులు



లెనిన్‌కుమార్‌, మనోజ్‌కుమార్‌

ఖమ్మంరూరల్‌: మండలంలోని గోళ్లపాడులో ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరు అన్నదమ్ములు రెండోసారి ప్రభుత్వ కొలువులు సాధించారు. గ్రామానికి చెందిన గీతకార్మికుడు గడ్డమీది వెంకటేశ్వర్లు, వెంకట్రావమ్మ దంపతుల కుమారులు లెనిన్‌కుమార్‌, మనోజ్‌కుమార్‌ ప్రస్తుతం ఒకరు కేరళలో బీఎస్‌ఎన్‌ఎల్‌లో పని చేస్తుండగా, మరొకరు అటవీశాఖలో బీట్‌ ఆఫీసర్‌గా ఉన్నారు. ప్రభుత్వం ప్రకటించిన గ్రూప్‌4లో లెనిన్‌కుమార్‌ ట్రెజరీశాఖలో జూనియర్‌ అకౌంటెంట్‌గా, మనోజ్‌కుమార్‌ రెవెన్యూ శాఖలో జూనియర్‌ అసిస్టెంట్‌గా ఉద్యోగాలు సాధించారు.

నగరంలో సినిమాలు

తిరుమల	కంగువ(3డి)
వినోద	లక్కీభాస్కర్‌
సాయిరాం	మట్కా,
	అప్పుడో ఇప్పుడో ఎప్పుడో
ఆదిత్య	రాధేకృష్ణ
శ్రీనివాస	అమరన్‌
సినీగెలాక్సీ	'క'

- ఖమ్మంగాంధీచౌక్‌

క్రీడా ప్రాంగణమా.. నీవెక్కడా?

రూపురేఖలు కోల్పోయిన గ్రామీణ క్రీడా ప్రాంగణాలు

- కనుమరుగవుతున్న క్రీడా స్థలాలు
- యంత్రాంగం పట్టింపులేనితనంతో క్రీడాకారులకు నిరాశ



కోరట్లగూడెంలో క్రీడా ప్రాంగణంలో సాగు చేస్తున్న మిర్చి తోట

నేలకొండపల్లి: గ్రామీణ ప్రాంతాల్లో క్రీడాకారులను ప్రోత్సహించేందుకు గత ప్రభుత్వం ప్రతీ పంచాయతీ, పట్టణాల్లో తెలంగాణ క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేసింది. ప్రభుత్వ భూములు ఉన్న చోట ఊరికి దూరంగా ఈ క్రీడా ప్రాంగాణాలను ఏర్పాటు చేసింది. కానీ నిర్వహణ లేకపోవటంతో పిచ్చిచెట్లు, పంట పొలాల మధ్య కనిపించకుండా ఉనికి కోల్పోతూ అధికార యంత్రాంగాన్ని వెక్కిరిస్తున్నాయి. పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగి ఆటలు ఆడే పరిస్థితి లేకుండా ఉంది. అయితే కొంతకాలం పంచాయతీలు బాగానే నిర్వహణ చేపట్టినా క్రమేపీ నిధులు, సిబ్బంది కొరత, అధికారుల నిర్లక్ష్యంతో ప్రాంగణాలు కనుమరుగవుతున్నాయి

రూ.కోట్లలో నిధులు నిరుపయోగం..

ఈ క్రీడా ప్రాంగణాల కోసం గతప్రభుత్వం రూ.కోట్ల నిధులు ఖర్చు చేసింది. ప్రతీ పంచాయతీలో దాదాపు రూ.1 లక్షకు పైగా, పట్టణంలో మరింత అదనంగా నిధులు వెచ్చించింది. క్రీడా మైదానాల్లో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్‌, లాంగ్‌ జంప్‌, వ్యాయామం చేసేందుకు సింగిల్‌, డబుల్‌బార్‌ ఉండేలా మైదానాలు ఉండాల్సి ఉన్నా అలాంటివి చాలా చోట్ల అవి కనిపించటం లేదు. దీంతో క్రీడా ప్రాంగణాలు నిరుపయోగంగా మారాయి.

స్థలాలు లేని చోట అద్దెకు..



బీడుగా మారిన కోనాయిగూడెం క్రీడా ప్రాంగణం

క్రీడాప్రాంగణాల కోసం ప్రభుత్వ స్థలాలలోనే ఏర్పాటు చేశారు. స్థలాలు లేని పంచాయతీల్లో ప్రైవేట్‌కు చెందిన స్థలాలను అద్దెకు తీసుకుని ఏర్పాటు చేశారు. అవి కూడ అద్దెలు చెల్లించే ఆర్థిక స్థితి లేక పంచాయతీలు వదిలేశాయి. మండలంలోని కోరట్లగూడెం, కోనాయిగూడెం పంచాయతీల్లో ప్రైవేట్‌ స్థలాల్లో క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేశారు. వాటిని అధికారులు వదిలివేయటంతో అక్కడ భూమి గల రైతు మిర్చితోటను సాగు చేస్తున్నారు. కోనాయిగూడెంలో బీడు భూమిని తలపించేలా ప్రాంగణం మారింది. స్థానిక కార్యదర్శి పట్టించుకున్న పాపాన పోలేదని స్థానికులు వాపోతున్నారు. మరికొన్ని పంచాయతీల్లోనూ ఇలాగే పూర్తిగా వదిలేశారు. ప్రభుత్వ లక్ష్యంను నేరవేర్చేందుకు, వినియోగంలోకి తీసుకొచ్చేలా ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని క్రీడాకారులు, గ్రామస్తులు కోరుతున్నారు.

వినియోగంలోకి తీసుకురావాలి



పంచాయతీల్లో గత ప్రభుత్వం ఏర్పాటు చేసిన తెలంగాణ క్రీడా ప్రాంగణాలను వినియోగంలోకి తీసుకురావాలి. యువతను క్రీడలలో నిలబట్టేందుకు ప్రాంగణాలు చాలా అవసరం. ప్రస్తుత ప్రభుత్వం అవసరం గుర్తించాలి. తగిన చర్యలు తీసుకోవాలి.

- కె.ప్రవీణ్‌, నేలకొండపల్లి

ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదు



యువతపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదు. క్రీడలపై ఆసక్తి ఉన్నప్పటికీ క్రీడా స్థలాలు లేక ఇబ్బంది పడుతున్నారు. క్రీడా ప్రాంగణాలు గ్రామాల్లో ఉత్సవ విగ్రహాలుగా ఉంటున్నాయి. వెంటనే చర్యలు తీసుకోవాలి.

- మస్తాన్‌, పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి

వినియోగంలోకి తీసుకొస్తాం...



మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలలో ఏర్పాటు చేసిన తెలంగాణ క్రీడా ప్రాంగణాలను పరిశీలిస్తాం. పరికరాల గురించి తెలుసుకుంటాం. అపరిశుభ్రంగా ఉన్న చోట్ల శుభ్రం చేయిస్తాం. త్వరలోనే వినియోగంలోకి తీసుకొస్తాం..

- సీహెచ్‌.శివ, ఎంపీఓ, నేలకొండపల్లి

నీటి మీద రాతల్లా హామీలు..



మాట్లాడుతున్న ఆవునూరి మధు

తిరుమలాయపాలెం: కాంగ్రెస్‌ ప్రభుత్వం ప్రజలకు రైతులకు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు నీటి మీద రాతల్లాగా మారిపోయాయని, ఆచరణలో అమలయ్యే పరిస్థితి లేకుండాపోయిందని సీపీఐ(ఎంఎల్‌) న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకులు ఆవునూరి మధు అన్నారు. సోమవారం తిరుమలాయపాలెం మండల కేంద్రంలో జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రైతులకు రూ. రెండు లక్షల రుణమాఫీ చేస్తామని చెప్పి పూర్తిగా చెయ్యలేదన్నారు. రైతాంగాన్ని పంటకు పెట్టుబడి కోసం రైతుబీమా, రైతులకు భరోసాగా ఎకరానికి రూ.7,500 వేస్తామని చెప్పి ఇంతవరకు వేయలేదని, ధాన్యం కొనుగోళ్లలో షరతులతో రైతులు ప్రైవేటు వ్యాపారులకు పంటను అమ్ముకోవాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. మూసీ, హైడ్రా పేరుతో పేదల ఇళ్లు కూల్చుతున్నారని, ఇళ్లను కూల్చే ఆలోచనను విరమించుకోవాలని డిమాండ్‌ చేశారు. ప్రభుత్వం సర్వేల పేరుతో కాలయాపన చేయకుండా చిత్తశుద్ధితో పనిచేయాలన్నారు. ఈ సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శి మందుల రాజేంద్రప్రసాద్‌, అఖిలభారత రైతు కూలీ సంఘం ఖమ్మం జిల్లా ప్రధాన కార్యదర్శి వై.ప్రకాష్‌, మండల కార్యదర్శి గొర్రెపాటి రమేష్‌, నాయకులు గొర్రెపాటి వీరస్వామి, జానకి, సుభాహన్‌, నాగయ్య, బ్రహ్మచారి, శ్రీనివాసరెడ్డి, లక్ష్మణ్‌, పట్టాభి పాల్గొన్నారు.

రైతుల అరెస్టుపై విచారణ చేపట్టాలి

ఖమ్మం మామిళ్లగూడెం: లగచర్ల రైతుల అరెస్టుపై న్యాయ విచారణ జరిపించి, వారికి రక్షణ కల్పించాలని వీరనారీమణుల ఆశయ సాధన జిల్లా అధ్యక్షురాలు భూక్యా ఉపేంద్రబాయి డిమాండ్‌ చేశారు. సోమవారం ఖమ్మంలోని సంఘం కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ... అధికారులపై దాడికి పాల్పడ్డదానిని సాకుగా తీసుకొని రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల్లో భయానక వాతావరణాన్ని సృష్టించడం తగదన్నారు. ఉపాధ్యక్షురాలు జ్యోతి, కార్యదర్శి చందు, సహాయ కార్యదర్శి విజయ, కార్యవర్గసభ్యులు ప్రమీల, ఝాన్సీ, లలిత తదితరులు పాల్గొన్నారు.

ఖమ్మంఅర్బన్‌: లగిచర్ల గ్రామంలో ఫార్మసిటీ ఏర్పాటుకోసమని గిరిజన భూములను లాక్కోవడం ప్రభుత్వ కుట్రపూరితంగా వ్యవహరించి, అమాయకులైన గిరిజనుల తప్పుడు కేసులు బనాయించడం సరికాదని ఆల్‌ ఇండియా బంజారా సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఇస్లావత్‌ రామచంద్రనాయక్‌, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బానోత్‌ బష్కినాయక్‌లు ప్రకటనలో ఖండించారు. సాగు చేసుకుంటున్న భూములకు ఇచ్చి పరిశ్రమ రంగాలకు ప్రోత్సహించకూడదని, గిరిజనులపైన పెట్టిన కేసులను బేషరత్తుగా ఉపసరించుకోవాలని డిమాండ్‌ చేశారు.

నిబంధనలు పెట్టిన వారిపై చర్య తీసుకోవాలి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఖమ్మంరూరల్‌: మండలంలోని కరుణగిరి ప్రాంతంలో అపార్ట్‌మెంట్‌ నిర్వాహకులు తమ అపార్ట్‌మెంట్లలో ఎస్సీ, ఎస్టీ, ముస్లిం, మైనార్టీలకు ఇల్లు కిరాయికి ఇవ్వకూడదని నిబంధన పెట్టిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ శరత్‌నాయక్‌, రమేష్‌నాయక్‌లు సీఐ ముష్క రాజుకు సోమవారం వినతిపత్రం అందజేశారు. కించపరిచే విధంగా అపార్ట్‌మెంట్‌ యజమానులు వ్యవహరించడం తగదని, వారిపై కేసు నమోదు చేయాలని సీఐకి విన్నవించారు. ఈ కార్యక్రమంలో శోభన్‌నాయక్‌, లచ్చునాయక్‌, రవి రాథోడ్‌, లింగానాయక్‌ తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రి ప్రారంభం



ఆస్పత్రిని ప్రారంభిస్తున్న మంత్రి తుమ్మల

ఖమ్మంవైద్యవిభాగం: నగరంలో ఆర్థోపెడిక్‌ సర్జన్‌ డాక్టర్‌ తోట లక్ష్మణ్‌కుమార్‌ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన టీఆర్‌ఆర్‌ ఆర్థో, యాక్సిడెంటల్‌ యూనిట్‌ కేర్‌ ఆస్పత్రిని సోమవారం రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థల చైర్మన్‌ రాయల నాగేశ్వరరావు, వైరా ఎమ్మెల్యే రాందాస్‌నాయక్‌, ఎమ్మెల్సీ తాత మధుసూదన్‌, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య, కాంగ్రెస్‌ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్‌, సీపీఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్‌, సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, కొండబాల కోటేశ్వరరావు, డాక్టర్‌ లక్ష్మణ్‌కుమార్‌, మాజీ కార్పొరేటర్‌ తోట రామారావు, గోవిందమ్మ, మాజీ కౌన్సిలర్‌ శీలంశెట్టి వీరభద్రం, కార్పొరేటర్‌ శీలంశెట్టి రమ తదితరులు పాల్గొన్నారు.

తుమ్మలను కలిసిన అయ్యప్ప భక్తబృందం



తుమ్మలతో అయ్యప్ప భక్త బృందం

ఖమ్మంవన్‌టౌన్‌/ ఖమ్మంగాంధీచౌక్‌: రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావును తన క్యాంపు కార్యాలయంలో సోమవారం అఖిల భారత అయ్యప్ప దీక్షా ప్రచార సమితి, అయ్యప్ప అన్నదాన పీఠ సభ్యులు రాంప్రసాద్‌ గురుస్వామి, పగడాల కిషోర్‌, సముద్రాల శ్రీనివాసరావు, శీలం గోపాల్‌రెడ్డి, పసుపులేటి నాగకృష్ణలు కలిసి సన్మానించారు. అన్నదాన పీఠాన్ని సందర్శించాలని మంత్రిని కోరారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... 16 ఏళ్లుగా మాలధారులకు దీక్షా సమయంలో పీఠం ద్వారా రోజుకు సుమారు 1,500 మందికి అన్నదానం నిర్వహిస్తున్న సభ్యులను మంత్రి అభినందించి, పీఠాన్ని సందర్శిస్తానన్నారు.

'దిలీప్‌ కొణతం అరెస్ట్‌ అప్రజాస్వామికం'

ఖమ్మంమయూరిసెంటర్‌: తెలంగాణ ఉద్యమకారుడు, మాజీ డిజిటల్‌ డైరెక్టర్‌ దిలీప్‌ కొణతం అరెస్టును తీవ్రంగా ఖండిస్తున్నట్లు ఎమ్మెల్సీ తాత మధుసూదన్‌ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కోర్టు ఆదేశాల మేరకు విచారణ నిమిత్తం సైబర్‌ క్రైమ్‌ పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన దిలీప్‌ కొణతంను పోలీసులు అక్రమంగా అరెస్టు చేయడం అప్రజాస్వామికమన్నారు. అక్రమంగా అరెస్టు చేసిన దిలీప్‌ కొణతంను బేషరతుగా విడుదల చేయాలని డిమాండ్‌ చేశారు.

గుంటు మల్లన్నకు పుష్పాభిషేకం



ఖమ్మంగాంధీచౌక్‌: పుష్పాభిషేకం నిర్వహిస్తున్న భక్తులు



రఘునాథపాలెం: వ్రత పూజలు చేస్తున్న భక్తులు

ఖమ్మంగాంధీచౌక్‌: కార్తీక మాస మహోత్సవాల్లో భాగంగా సోమవారం నగరంలోని స్వయంభు శ్రీ భమరాంబ సమేత శ్రీ గుంటు మల్లేశ్వర స్వామి ఆలయంలో స్వామి వారికి మహాపుష్పాభిషేకం కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి చుండూరు రామకోటేశ్వరరావు పర్యవేక్షణలో అర్చకులు దాములూరి వీరభద్రరావు, దాములూరి కృష్ణశర్మలు సాంప్రదాయ పద్ధతుల్లో కార్యక్రమాలను నిర్వహించారు.

కామేపల్లి: మండలంలోని కామేపల్లి, పండితాపురం, ఊట్కూర్‌ శివాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజారులు ప్రత్యేక అభిషేకాలు, అలంకరణ చేసి పూజలు చేశారు.

సామూహిక వ్రతాలు..

రఘునాథపాలెం: మండలంలోని కోయచలకలో శ్రీ సీతారామచంద్ర స్వామి దేవాలయంలో కార్తీక మాసోత్సవాల్లో భాగంగా సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాన్ని భక్తులు పెద్దఎత్తున పాల్గొని నిర్వహించారు. అర్చకులు వెంకటేశ్వర శాస్త్రి కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించాలి



ఫిర్యాదులు స్వీకరిస్తున్న అహ్మద్‌ షఫీఉల్లా

ఖమ్మంమయూరిసెంటర్‌: గ్రీవెన్స్‌కు వచ్చిన ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించాలని కేఎంసీ అసిస్టెంట్‌ కమిషనర్‌ అహ్మద్‌ షఫీఉల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం కేఎంసీ సమావేశ మందిరంలో నిర్వహించిన గ్రీవెన్స్‌లో ప్రజల నుండి వినతులు, ఫిర్యాదులను అసిస్టెంట్‌ కమిషనర్‌ స్వీకరించి, వాటిని పరిశీలించి పరిష్కారం కోసం సంబంధిత అధికారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రజల సమస్యలను పరిష్కరించడంలో అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, సమస్యలపై ప్రజలను కార్యాలయం చుట్టు తిప్పించుకోవద్దని, మొత్తం 14 మంది పలు సమస్యలపై వినతులు, ఫిర్యాదులు అందించగా వాటిలో రెవెన్యూ, టౌన్‌ప్లానింగ్‌, శానిటేషన్‌ పలు విభాగాలకు చెందినవి ఉన్నాయి. ఈ కార్యక్రమంలో ఈఈ కృష్ణాలాల్‌, ఏసీపీ వసుందర, ఏవో శివలింగం, ఆర్‌వో జి.శ్రీనివాసరావు, ఆర్‌ఐ జ్యోతి, ఏఎస్‌వో లింగయ్య, శానిటరీ సూపర్‌వైజర్‌ సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు



పోటీలో పాల్గొన్న విద్యార్థులు

ఖమ్మంగాంధీచౌక్‌: జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా ఖమ్మం జిల్లా కేంద్ర గ్రంథాలయంలో సోమవారం విద్యార్థులకు పట్టణీకరణతో జరుగుతున్న కాలుష్యంపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలను నిర్వహించారు. నగరంలోని పలు పాఠశాలలు, కళాశాలలకు చెందిన విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొని ప్రతిభను కనబరిచారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ కార్యదర్శి అర్జున్‌, గ్రంథాలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు కేవీఎస్‌ఎల్‌ఎన్‌ రాజు, కార్యదర్శి ఎండీ.ఇమామ్‌, గ్రంథాలయ ఉద్యోగులు, సిబ్బంది భాస్కర్‌, లలిత కుమారి, రవిబాబు, అఖిల్‌, కిషోర్‌, రోజా, విజయ కుమారి తదితరులు పాల్గొన్నారు.

సమస్యను పక్కదారి పట్టించే యత్నం



నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

ఖమ్మం మామిళ్లగూడెం: సమస్యను పక్కదారి పట్టించడానికే మెడికల్‌ కళాశాల ప్రిన్సిపాల్‌ ప్రయత్నం చేస్తున్నాడని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు లక్ష్మణ్‌, వెంకటేశ్‌లు అన్నారు. ప్రభుత్వ మెడికల్‌ కళాశాలలో విద్యార్థికి గుండు కొట్టించిన ఘటనపై వాస్తవాలు తెలియజేయాలని సోమవారం వెళ్లగా వారిని పోలీసులు అడ్డుకున్నారు. దీనిపై నిరసనకు దిగారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... మొన్న వరంగల్‌ ఎంబీబీఎస్‌ విద్యార్థి ఆత్మహత్య, నిన్న ఖమ్మం జిల్లా మెడికల్‌ కళాశాలలో విద్యార్థిని గుండు గీయించడం, నేడు నల్లగొండలో ర్యాగింగ్‌ కారణం చేత ఐదుగురు విద్యార్థులు సస్పెండ్‌ కావడమే నిదర్శనమన్నారు. ఈ ఘటనను పక్కదరిపట్టించే విధంగా అదే కాలేజీ సిబ్బందిని ఎంక్వయిరీ కమిటీ వేయటమెంటని ప్రశ్నించారు. ఇప్పటికైనా కలెక్టర్‌ స్పందించి, జిల్లా ఎస్పీ పరిధిలో విచారణ జరిపించాలని కోరారు. ఆ ఘటనపై వాస్తవాలను విచారించి విద్యార్థులకు న్యాయం చేయాలని లేనిపక్షంలో పోరాటం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు పృథ్వీ, యశ్వంత్‌, స్టాలిన్‌, వెంకటేశ్‌, శ్రీకాంత్‌, సాయి, సంతోష్‌, యాఖుబ్‌ తదితరులు పాల్గొన్నారు.

ప్రణాళిక పాటిస్తే వ్యాపారాభివృద్ధి



మాట్లాడుతున్న రవికుమార్‌

ఖమ్మంవ్యవసాయం: ప్రణాళిక పాటిస్తే వ్యాపారం అభివృద్ధి పథంలో నిలుస్తుందని సహకార శాఖ అసిస్టెంట్‌ రిజిస్ట్రార్‌ సీహెచ్‌ రవికుమార్‌ అన్నారు. 71 అఖిల భారత సహకార వారోత్సవాల్లో భాగంగా సోమవారం సహకార సంస్థల మధ్య సహకార, బలోపేతం అనే అంశంపై జిల్లా కో ఆపరేటివ్‌ మార్కెటింగ్‌ సొసైటీ (డీసీఎంఎస్‌) కార్యాలయంలో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రవికుమార్‌ మాట్లాడుతూ.. సహకార సంఘాల మధ్య పరస్పర సహకారం అవసరమన్నారు. సంఘ కార్యవర్గ సభ్యులు శ్రీనివాసరావు, బోళ్లో కోటయ్య, కుంచపు వెంకటేశ్వర్లు, పగిడి అంజయ్య, అసిస్టెంట్‌ రిజిస్ట్రార్‌ అసీఫ్‌ అన్వర్‌, సంఘం బిజినెస్‌ మేనేజర్‌ సందీప్‌కుమార్‌ పాల్గొన్నారు.

పెంచిన మెస్‌చార్జీలు అమలుచేయాలి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఖమ్మం మామిళ్లగూడెం: సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థులకు పెంచిన మెస్‌చార్జీలు వెంటనే అమలు చేయాలని కోరుతూ ఎస్సీ డీడీ కస్తాల సత్యనారాయణకు పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మందా సురేష్‌, భూక్యా ప్రభుదేవ, నాయకులు జార్జిరెడ్డి ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. చలికి విద్యార్థులు వణికిపోతున్నారని రగ్గులు, స్నానానికి వేడినీళ్లు అందించాలని డిమాండ్‌ చేశారు.

సీఎంఆర్‌ఎఫ్‌ చెక్కుల పంపిణీ

ఖమ్మంవన్‌టౌన్‌: నగరంలోని 25వ డివిజన్‌లో లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్‌ చెక్కులను సోమవారం కాంగ్రెస్‌ నాయకుడు వడ్డెబోయిన నర్సింహారావు పంపిణీ చేశారు. దాసరి పూర్ణ, రాధాకృష్ణ, నాగభూషణం, ఖాజా, శ్రీను, వీరన్న ఉన్నారు.

24న ఆర్యవైశ్య వనసమారాధన

ఖమ్మంగాంధీచౌక్‌: ఆర్యవైశ్య కార్తీకమాస వనసమారాధన ఈ నెల 24న నగరంలోని చెరుకూరివారి తోటలో నిర్వహిస్తున్నట్లు వనసమారాధన ఆహ్వాన కమిటీ ప్రతినిధులు చిన్ని కృష్ణారావు, మేళ్లచెరువు వెంకటేశ్వరరావు తెలిపారు. సోమవారం నగరంలోని గుట్టలబజార్‌లో ఉన్న శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరీ దేవాలయం నగర ఆర్యవైశ్య కార్యాలయంలో వనసమారాధనపై నగర ఆర్యవైశ్య సంఘం సమావేశాన్ని నిర్వహించారు. ఆర్యవైశ్యులు ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సంఘం గౌరవ అధ్యక్షులు గోళ్ల రాధాకృష్ణమూర్తి, అధ్యక్షుడు గుమ్మడివెల్లి శ్రీనివాస్‌, వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ మాశెట్టి వరప్రసాద్‌, ప్రధాన కార్యదర్శి రాయపూడి రవికుమార్‌, కోశాధికారి రాయపూడి జయరామ్‌, ఖమ్మం చాంబర్‌ ఆఫ్‌ కామర్స్‌ ఉపాధ్యక్షుడు జీవై నరేష్‌, శ్రీ షిర్డీ సాయిబాబా మందిరం చైర్మన్‌ వేములపల్లి వెంకటేశ్వరరావు, కొత్త వెంకటేశ్వరరావు, డాక్టర్‌ డీపీసీ రావు, గోపాల్‌రావు, రామ్మోహన్‌ రావు, దివాకర గుప్తా పాల్గొన్నారు.

రేపు 'సంఘం శరణం గచ్ఛామి' నాటిక ప్రదర్శన

ఖమ్మంగాంధీచౌక్‌: ఖమ్మం నగరంలోని భక్త రామదాసు కళాక్షేత్రంలో బుధవారం రాత్రి 7 గంటలకు 'సంఘం శరణం గచ్ఛామి' నాటిక ప్రదర్శన ఉంటుందని నెల నెలా వెన్నెల నిర్వాహకులు అన్నాబత్తుల సుబ్రమణ్యకుమార్‌ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అంబేడ్కర్‌ జీవితం, ఆశయాలు, పోరాటాలపై అభ్యుదయ ఆర్ట్స్‌ అకాడమి హైదరాబాద్‌ వారు నాటికను రూపొందించారని తెలిపారు. కె.దేవేంద్ర రచించిన ఈ నాటికకు తూము శివప్రసాద్‌ దర్శకత్వం వహించినట్లు తెలిపారు.

విద్యాసంస్థల వనసమారాధనలు



విద్యార్థులతో రెజొనెన్స్‌ డైరెక్టర్‌ కృష్ణవేణి తదితరులు



వనసమారాధనలో మాట్లాడుతున్న హార్వెస్ట్‌ ప్రిన్సిపాల్‌ పార్వతీరెడ్డి

ఖమ్మం సహకారనగర్‌: నగరంలోని పలు ప్రైవేటు పాఠశాలలు కార్తీక మాసం సందర్భంగా సోమవారం వనసమారాధన కార్యక్రమాన్ని నిర్వహించాయి. నగరంలోని శ్రీనగర్‌ కాలనీలోని రెజొనెన్స్‌ పాఠశాల ఆధ్వర్యంలో చెరుకూరి గార్డెన్స్‌లో వనసమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. డైరెక్టర్లు కొండా శ్రీధర్‌రావు, కృష్ణవేణి సిబ్బంది పాల్గొన్నారు. హార్వెస్ట్‌ ప్రైమరీ విద్యార్థులకు కొదుమూరు మామిడితోటలో వన సమారాధన కార్యక్రమాన్ని నిర్వహించినట్లు హార్వెస్ట్‌ కరస్పాండెంట్‌ రవిమారత్‌, ప్రిన్సిపాల్‌ పార్వతిరెడి తెలిపారు. ప్రిన్సిపాల్‌ మానస, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.